www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 జూలై 2024
5
పశ్చిమ గోదావరి



సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణను అంగన్వాడీ ప్రాజెక్టు కమిటీ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో పితానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు లీడర్ కానూరి తులసి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలుతోపాటు రాష్ట్రంలో అంగన్వాడీలు సుదీర్ఘకాలం చేసిన సమ్మె కాలంలో అనివార్యంగా గత ప్రభుత్వం కొన్ని జిఒలు ఇచ్చినా ప్రధాన సమస్యలు పరిష్కారం చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు వైట్ల ఉషారాణి, విజయలక్ష్మి, పిడి పరమేశ్వరి, నాగలక్ష్మి, రాధ పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన మేడిపల్లి - వేలేరుపాడు రోడ్డు



అల్లూరి నగర్‌లో ఇళ్లలోంచి కొట్టుకొచ్చిన సామగ్రి

భయం.. భయం..!

రెండు జిల్లాలపై వర్షాలు, వరదల ప్రభావం

చిగురుటాకులా వణుకుతున్న ఏజెన్సీ

పెద్దవాగు ప్రాజెక్టుకు గండిచీలవంగ డితో 14 గ్రామాలపై పెనుప్రభావం

ఇళ్లు కూలి, పశువులు చనిపోవడంతో జనం గగ్గోలు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పలుచోట్ల రోడ్లకు గండ్లు

పలు గ్రామాలకు రాకపోకలు బంద్, 48 గంటలుగా కరెంట్ కట్

ప్రమాదకర స్థాయిలో ఎర్రకాలువ ఉధృతి

20 వేల ఎకరాల్లో నాట్లు, 1480 ఎకరాల్లో నారుమళ్లు మునక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన 48 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వర్ష భీభత్సానికి ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగుపొర్లుతుండటం, పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో అక్కడి ప్రజలు చిగురుటాకులా వణికిపోతున్నారు. భారీ వర్షాలకు డెల్టా ప్రాంతంలో వేల ఎకరాల్లో నాట్లు నాటిన పొలాలు, నారుమడులు నీట మునగడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా రెండు జిల్లాల్లోనూ వర్షం వెంటాడుతోంది. గడిచిన 24 గంటల్లో ఏలూరు జిల్లాలో సరాసరిన 99.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే, అత్యధికంగా ఏజెన్సీ ప్రాంతాలైన వేలేరుపాడులో 269 మిల్లీమీటర్లు, బుట్టాయగూడెంలో 268.8, కుక్కునూరులో 178.8, జంగారెడ్డిగూడెంలో 168, జీలుగుమిల్లిలో 141.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లాలో సరాసరిన 87.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా, తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 133 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. భారీ వర్షాలకు ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రిజర్వాయర్లలోకి భారీగా వరదనీరు చేరడంతో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్న ప్రమాదం ఏర్పడింది. ఏజెన్సీలో పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో వేలేరుపాడు మండలాల్లోని మేడిపల్లి, కమ్మరిగూడెం, అల్లూరి నగర్, మాధవరం, రామవరం, గుల్లవాయి వంటి 14 గ్రామాలపై తీవ్ర ప్రభావం పడింది. పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. కరెంటు స్తంభాలు నేలనంటాయి. భారీగా పశువులు మృతి చెందాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కట్టుబట్టలతో మిగిలిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం మూడు వేల భోజనం ప్యాకెట్లు అధికారులు పంపిణీ చేశారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదు. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో గడిచిన 48 గంటలుగా వేలేరుపాడు, కుక్కునూడు మండలాల్లో కరెంటు లేకుండాపోయింది. దీంతో అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. భారీ వర్షాలకు కుక్కునూరు, దాచారం మధ్య ఉన్న గుండేటి వాగు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో బెస్తగూడెం, నెమలిపేట, అరసపల్లి, గొమ్ముగూడెం, సీతారామపురం వంటి 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. కుక్కునూరు మండలం ఉప్పేరు దగ్గర వాగు పొంగి రెడ్డిగూడెం గ్రామంలోని ఆరు ఇళ్లు నీటమునిగాయి. వీరిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన పరిస్థితి కొనసాగింది. వేలేరుపాడు మండలంలో నార్లవరం, బోళ్లపల్లి మధ్య ఎద్దువాగు వంతెన దెబ్బతిని పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడటంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు వెళ్లే ప్రధాన రహదారులకు సైతం గండ్లు పడటంతో పరిస్థితి అధ్వానంగా మారింది. శుక్రవారం కలెక్టర్, ఎస్‌పి ఇతర అధికారులు ఏజెన్సీలో పర్యటించి సహాయక చర్యలకు ఆదేశించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 26.30 అడుగులకు చేరింది. దిగువకు 3.30 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. గోదావరికి పెద్దగా వరద పోటు లేకపోవడం ఊరట కలిగించే అంశంగా చెప్పొచ్చు.

జలాశయాల నుంచి పెద్దఎత్తున నీటి విడుదల

ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలకు అక్కడి జలశయాలకు భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో పలు జలశయాల నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ఎర్రకాలువ ప్రాజెక్టుకు 25 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతుండటంతో దిగువకు 14,524 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జంగరెడ్డిగూడెం మండలంలోని లక్కవరం పరిసర గ్రామాల్లోకి వరదనీరు చేరుతోంది. నల్లజర్ల, తాడేపల్లిగూడెం మండలాల్లోని మాధవరం, మారంపల్లి, జగన్నాధపురం, వీరంపాలెం, దండగర్ర గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటపొలాలు నీట మునుగుతున్నాయి. బుట్టాయగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మ ప్రాజెక్టు నుంచి 1500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కొవ్వాడ, పోగొండ ప్రాజెక్టుల్లోకి పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. శుక్రవారం వాగుల ఉధృతి కొంత తగ్గినప్పటికీ పరిస్థితి మాత్రం ఇంకా ప్రమాదకరంగానే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

20 వేల ఎకరాల్లో పంట పొలాలు మునక

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు రెండు జిల్లాల్లోనూ పెద్దఎత్తున పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ 15,485 ఎకరాల్లో నాట్లు, 1240 ఎకరాల్లో నారుమడులు ముంపునకు గురయ్యాయి. ఏలూరు జిల్లాలో 4,187 ఎకరాల్లో నాట్లు, 240 ఎకరాల్లో నారుమడులు మునిగాయి. ఏలూరు జిల్లాలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ద్వారకాతిరుమల, చింతలపూడి ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వెంటనే వరదనీరు తగ్గితే నష్టం తగ్గే అవకాశం ఉంది. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మాత్రం రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ.పది వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టిన పరిస్థితి ఉంది.



తాడేపల్లిగూడెం : నీటమునిగిన పంట పొలాలు

వణికిస్తున్న వాన..

ముంపులో 496 హెక్టార్లలో నారుమడులు, 6,194 హెక్టార్లలో నాట్లు

నేడు పాఠశాలలకు సెలవు ప్రకటించిన కలెక్టర్

భీమవరం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అల్పపీడన ప్రభావంతో ఏర్పడిన ముసురు వీడలేదు. రెండు రోజుల నుంచి ఎడతెరిపిలేని కుండపోత వర్షం పడుతోంది. గురువారం తెల్లవారుజామున పిడుగులు, ఈదురుగాలులతో ప్రారంభమైన వర్షం శుక్రవారం రాత్రి వరకూ కురుస్తూనే ఉంది. ఈ అల్పపీడనం కొనసాగుతుండగానే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో వచ్చే రెండు, మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నారుమడులు, నాట్లు పూర్తిగా నీట మునగడంతో వాటిని రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

జిల్లాలో రెండు లక్షల పదకొండు వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు ప్రారంభించారు. ఇప్పటివరకూ జిల్లాలో 4,352 హెక్టార్లలో నారుమడులు, 36,299 హెక్టార్లలో నాట్లు వేశారు. రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల వల్ల 496 హెక్టార్లలో నారుమడులు, 6,194 హెక్టార్లలో నాట్లు, వెదజల్లిన పొలాలు ముంపునకు గురయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే రైతాంగం వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు ఆకుమడి నిమిత్తం విత్తనాలకు రూ.1,500, చేను దమ్ము చేసేందుకు రూ.1500, ఎరువులు, పురుగుల మందులకు రూ.2,500 వరకూ పెట్టుబడి పెట్టారు. ఎకరాల్లో దమ్ము చేసేందుకు రూ.1,500, నాట్లు వేసేందుకు రూ.5 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. ఇప్పటివరకు ఎకరానికి రూ.10 వేల నుంచి 13 వేల వరకూ రైతులు పెట్టుబడి పెట్టారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు ఎటూ లాగకపోవడంతో మోటార్లతో నీరు బయటకు పంపినా ఉపయోగం లేకుండా పోతోందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడంతా నీటిపాలు అవుతోందని కన్నీరు పెడుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

నేడు పాఠశాలలకు సెలవు ప్రకటించిన కలెక్టర్

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారం అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకూ సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులను జారీ చేశారు. ఆయా పాఠశాలల్లో సెలవు అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో భీమవరం కలెక్టరేట్లో కలెక్టర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అలాగే ఆయా మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సమయంలో బాధితులు 08816-299219 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్లు 1070-1800-425-0101-833390505 22లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దు

అల్పపీడనం మరింత బలపడడంతో సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఆర్‌విఎస్.ప్రసాద్ సూచించారు. ప్రస్తుతం ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని, తరువాత ప్రకటన వెలువడే వరకూ చేపల వేటకు వెళ్లొద్దని తెలిపారు.

జిల్లాలో 87.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా సరాసరి 87.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 133 మిల్లీమీటర్లు, యలమంచిలిలో 50.2, పెనుమంట్రలో 100.6, పెనుగొండలో 72.4, ఆచంటలో 82.4, పోడూరులో 94.4 మొగల్తూరులో 71.4 నరసాపురంలో 84.6, పాలకొల్లులో 123.6, గణపవరంలో 106.4, ఆకివీడులో 58.2, ఉండిలో 82.6, పాలకోడేరులో 79.4, వీరవాసరంలో 65.6, భీమవరంలో 88.6, కాళ్లలో 51.6, పెంటపాడులో 133, తణుకులో 112.8, అత్తిలిలో 78.6 ఇరగవరంలో, 94 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వీడని వర్షం.. పల్లపుప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆచంట నియోజకవర్గం రెండో రోజు శుక్రవారం వర్షంతో తడిసి ముద్దయ్యింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. పంచాయతీ అధికారులు అప్రమత్తమై ఆయా కాలనీలో వర్షపు నీరు నిల్వలేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. వర్షం ఆగితే గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి బ్లీచింగ్ చల్లిస్తామని పంచాయతీ కార్యదర్శి జి.నరసింహారావు తెలిపారు.

కాళ్ల : కురిసిన భారీ వర్షాలకు 65 ఎకరాల్లో నారుమడులు ముంపునకు గురై దెబ్బతింటున్నాయి. మండలంలోని కాళ్లకూరు, జువ్వలపాలెం, వేంపాడు, కోపల్లె, జక్కరం, కాళ్ల గ్రామాల్లో నారుమడులు దెబ్బతిన్నాయి. నారుమళ్లలోని నీటిని బయటకు మళ్లించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేజర్ డ్రెయిన్‌లో ఉన్న గుర్రపుడెక్క తొలగింపు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పొంగిపొర్లుతున్న వెంకయ్య వయ్యేరు కాలువ

ఆకివీడు : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వెంకయ్య వయ్యేరు కాలువ పొంగిపొర్లుతోంది. దీంతో ఆకుమడుల్లో నీరు నిలిచిపోయింది. పట్టణంలోని చంద్రబాబు నాయుడు నగర్ కాలనీ, శాంతినగర్, శ్రీనగర్ దిగువ ప్రాంతం, సమతా నగర్ ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. కాలనీలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. నీరు బయటకు వెళ్లే మార్గం లేక ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. రోడ్లపై సైతం నీరు నిలిచిపోయింది.

పాలకొల్లు : పాలకొల్లులో శుక్రవారం కూడా ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. దీంతో డ్రెయినేజీలు నిండిపోయి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చిరు వ్యాపారులు అమ్మకాలు లేక గగ్గోలు పెడుతున్నారు.

యనమదుర్రు కాలువ ఉధృతం

గణపవరం : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలో యనమదుర్రు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎస్.కొండేపాడు గ్రామంలో ఎనిమిది వందల ఎకరాల్లో వరి



మొగల్తూరు హైస్కూల్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

చేలు నీట మునిగాయి. యనమదుర్రు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో కాలువ గట్టు మట్టి జారిపోతోంది. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం వద్ద కంగురుగూడెం ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లు ఎత్తివేయడంతో యనమదుర్రు కాలువలోకి నీరు అధికంగా వస్తోందని సర్పంచి భర్త సీతాళంపుల్లయ్య నాయుడు చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే వంతెన మునిగిపోతుందని, దీంతో రాకపోకలు నిలిచిపోతాయని తెలిపారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెనుమంట్ర : కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. పెనుమంట్ర వద్ద బ్రాహ్మణచెర్వు - వెలగలవారిపాలెం పంటకాల్వ గట్లు ఒరుసుకుంటూ ప్రవహించడం వల్ల వంతెన పక్కన ఉన్న ఎస్‌టి కాలనీలోకి నీరు చేరింది. అలాగే పొలాలు నీట మునడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తాడేపల్లిగూడెం : కురుస్తున్న వర్షాలకు ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని బంగారుగూడెం, వీరంపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాధపురం దండగర్ర తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. సుమారు 6,756 ఎకరాలు నీట మునిగినట్లు ఎడిఎ మురళీకృష్ణ తెలిపారు. ఇప్పటికే ప్రమాద స్థాయిని మించి ఎర్రకాలువ ప్రవహిస్తోందని, ఇంకా రెండు రోజులు ఇదేవిధంగా వర్షాలు కురిస్తే పంట అధికంగా నష్టపోయే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

నరసాపురం : గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకూ జిల్లాలో 87.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తాడేపల్లిగూడెంలో 133.0, పాలకొల్లులో 123.6, పెంటపాడులో 113.0, తణుకులో 112.8, గణపవరంలో 106.4, పెనుమంట్రలో 100.6, పోడూరులో 94.4, ఇరవగరంలో 94.0, భీమవరంలో 88.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. నరసాపురంలో 84.6, ఉండిలో 82.6, ఆచంటలో 82.4, పాలకోడేరులో 79.4, అత్తిలిలో 78.6, పెనుగొండలో 72.4, మొగల్తూరులో 71.4, వీరవాసరంలో 65.6, ఆకివీడులో 58.2, కాళ్లలో 51.6, యలమంచిలిలో 50.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో 20 మండలాలకు గాను 1743.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటు వర్షపాతం 87.2 మిల్లీమీటర్లు అని అధికారులు తెలిపారు.

తణుకు : ఎడతెరిపి లేని భారీ వర్షాలు, ఈదురుగాలులకు పట్టణంలోని చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో భారీ వృక్షం నేలకొరిగింది. ఆ సమయంలో విద్యార్థులెవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

మొగల్తూరు : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల జనవాసాల మధ్య నీరు నిలిచిపోయింది. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో మోకాళ్ల లోతు వరకూ వర్షపు నీరు నిలిచిపోయింది. చుట్టూ మెరకగా ఉండడం, డ్రెయిన్ సౌకర్యం లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికి మోకాల్లోతు నీరు నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యాన్ని గురవుతున్నారు. అలాగే మొగల్తూరులోని పాతకాలువ ప్రాంతంలో భారీ చెట్టు పంట కాలువలోకి ఒరిగింది.

పెనుగొండ : భారీ వర్షాలకు మండలంలో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. దొంగ రవిపాలెం జాతీయ రహదారి పక్కన చెట్టు కూలిపోవడంతో హైవే పోలీసులు వాటిని తొలగించారు

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, ఎంఎల్‌ఎలు పర్యటన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎర్రకాలువ వరదలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఎర్రకాలువ వరదలకు మండలంలోని వీరంపాలెం, కొమ్ముగూడెం పట్టింపాలెం, అప్పారావుపేట, జగన్నాధపురం, మాధవరం, మారంపల్లి, నందమూరు, నవాబ్ పాలెం, దండగర్ర గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలిసి పరిశీలించారు. ఏటా చిన్నపాటి వరదలకు పంటను నష్టపోతున్నామని ఎర్రకాలువ పరివాహక ప్రాంత రైతులు ఎంఎల్‌ఎ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఎర్రకాలువ గట్లు పటిష్టం చేశామని, గత వైసిపి ప్రభుత్వం కనీసం ఎర్రకాలువ వైపు చూసిన పాపాన పోలేదని అన్నారు. అధికారులు పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించాలని సూచించారు. అనంతరం జగన్నాధపురంలోని వరద బాధితుల నిరాశ్రయ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన వెంట ఎడిఎ పి.మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు ఉన్నారు.

నరసాపురం : మండలంలోని సరిపల్లి వద్ద నీట మునిగిన నారుమడులు, పంట కాలువల పనితీరును ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు శుక్రవారం పరిశీలించారు. రైల్వేట్రాక్ నిర్మాణంలో పాలకొల్లు హైవే దగ్గర డ్రెయిన్‌కు అండర్‌పాస్ నిర్మించాలని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తానని గ్రామస్తులకు ఆయన హామీ ఇచ్చారు.



యనమదుర్రు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ, కలెక్టర్

అలాగే వేములదీవి వెస్ట్ సర్దుకొడప, వడ్డేవారిమెరక, కాపులకొడప, చినమైనవానిలంక ముంపు గ్రామాల్లో నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పర్యటించారు. అనంతరం వేములదీవి పడమర చినమైనవానిలంకలో వంతెనను పరిశీలించి తక్షణం శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.

తణుకు : మండలం దువ్వ, యనమదుర్రు డ్రెయిన్, తిరపతిపురానికి సంబంధించి మీనవల్లూరు లాకులను జిల్లా కలెక్టర్ సి.నాగరాణి శుక్రవారం ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి పరిశీలించారు. ఎర్రకాలువ ఉధృతి వల్ల దువ్వ వయ్యేరు వద్ద నీటి ప్రభావం పెరుగుతుందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అక్విడెట్ వద్ద నీటి ప్రభావంతో ముంపునకు గురైన పల్లపు ప్రాంతాలను ఎంఎల్‌ఎ కలెక్టర్‌కు చూపించారు. వంతెన వద్ద పూరి గుడిసెల్లో ఉంటున్న వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. అనంతరం పింఛన్ అందక బాధపడుతున్న వికలాంగ బాలుడితో మాట్లాడి త్వరలో పింఛన్ అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట టిడిపి, జనసేన, బిజెపి నేతలు ఉన్నారు.

గోదావరికి వరద.. ఆందోళనలో జనం

ఆచంట: గోదావరికి వరద ఉధృతి పెరిగింది. రెండు రోజులుగా గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో లంకవాసుల్లో ఆందోళన నెలకొంది. ధవళేశ్వరం వద్ద నీటి విడుదలను పెంచడంతో లంక గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం కన్పిస్తోంది. ఇప్పటికే గోదావరి తీరం వెంబడి పుష్కరఘాట్లు నీట మునిగాయి. లంక భూముల్లోకి వరద నీరు చేరుతుంది. గోదావరికి వరద ఉధృతి పెరగడంతో నదిపై నాటు పడవల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో అయోధ్యలంక, పెదమల్లంలంక, పల్లెపాలెం తదితర గ్రామాలకు రాకపోకలు కష్టంగా మారాయి.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశానికి జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షత వహించి మాట్లాడారు. పరిశ్రమలు జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని, ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో గుర్తించిన 45 ప్రమాదకర పరిశ్రమలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. సింగిల్ డెస్క్ పాలసీ కింద 2023 నవంబర్ 24 నుంచి 2024 జులై 18వ తేదీ వరకూ అందిన 171 దరఖాస్తుల్లో 164 దరఖాస్తులను ఆమోదించగా, మూడు దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద సబ్సిడీ రుణాలకు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎం.మంగపతిరావు, జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి కె.గంగాధర్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎంవిఎస్.ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కోడేరు వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతున్న నేపథ్యంలో ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లంక గ్రామాలు ప్రస్తుతానికి సురక్షితంగా ఉన్నాయని, రెండు, మూడు రోజుల్లో వరద ఉధృతి ఇలాగే ఉంటే పల్లపు ప్రాంతాల్లోకి నీరు ప్రవేశించే అవకాశం ఉందన్నారు. లంకగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పుష్కర ఘాట్‌లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ రాజకుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, శిథిలావస్థ భవనాలు, గుడిసెలు, షెడ్లలో నివసిస్తున్న వారిని తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ ఐపి శెట్టి, ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్, ఆర్‌ఐ జయలలిత, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

సాగు చేసే రైతులకు న్యాయం చేయాలి

కౌలు రైతుసంఘం ఆధ్వర్యాన ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - ఆచంట

కౌలు చట్టంలో మార్పులు చేసి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు అన్నారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొమ్ముచిక్కాలలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణను కలిసి కౌలు రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగు ఆరంభమై నెలలు గడిచిపోతున్నా ఇప్పటికీ ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభం కాని పరిస్థితి నెలకొందన్నారు. కొత్త ప్రభుత్వం ఇ-క్రాప్ నమోదుకు సంబంధించి ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం రైతుల్లో ఆందోళన కలుగుతుందన్నారు. పంట రుణాలు నుంచి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, బీమా, ధాన్యం విక్రయం వంటి


ఎంఎల్ఎ పితానికి వినతినందిస్తున్న నాయకులు

అనేక ఇ-క్రాప్ ఆధారంగానే జరుగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఆ భూమిలో ఏ పంట సాగు చేస్తున్నారో గుర్తించి రైతు పేరుతో సహా ఇ-క్రాప్ సైట్లో నమోదు చేయాలన్నారు. దీని ఆధారంగానే బ్యాంకులు పంట రుణాలు మంజూరు నుంచి ప్రభుత్వం కౌవులకు అందించే ప్రతిసాయం వర్తిస్తుందని తెలిపారు. పంట రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇ-క్రాప్ నమోదు మాత్రం ప్రారంభం కాకపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న రైతుల పేర్లు, పంట వివరాలను ఇ-క్రాప్లో నమోదు చేయాలి కానీ గత ప్రభుత్వం దీనిని పూర్తిగా తుంగలో తొక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు చట్టంలో మార్పులు చేసి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొంతు శ్రీనివాస్, నేతల నాగేశ్వరరావు, బాలాజీ ఉన్నారు.

ఎంపిడిఒ అదృశ్యంపై లోతైన విచారణ చేపట్టాలి : వైసిపి

నరసాపురం: నరసాపురం ఎంపిడిఒ అదృశ్యం కేసులో మాజీ ఎంఎల్ఎ ప్రసాదరాజు పేరును ప్రస్తావించడం రాజకీయ కుట్రలో భాగమేనని వైసిపి నేతలు ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో ప్రభుత్వ తీరును తప్పు బట్టారు. ఈ సందర్భంగా నాయకులు వైకెఎస్ మాట్లాడుతూ వెంకటరమణ రావు అదృశ్యమై అయిదు రోజులు కావస్తున్నా నేటికీ ఫలితం దక్కకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుందని, ఈ ఘటనపై లోతైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే విచారణకు ఆదేశించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. ఎంపిడిఒ అదృశ్యంను రాజకీయం చేయటం తగదన్నారు.

వరద ఉధృతి పరిశీలించిన ఎంఎల్ఎ

తణుకు: విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని దువ్వ గ్రామంలో ఉద్రిక్తంగా ప్రవహిస్తున్న వయ్యేరు కాలువ వరదను శుక్రవారం తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లో పర్యటించి, అధికారులతో సమీక్షించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాధాకృష్ణ ఆదేశాలతో దువ్వ ఏటిగట్టు పటిష్టత కోసం ఇసుక మూటలను ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. గ్రామంలోకి వరద నీరు రాకుండా ఏర్పాట్లు చేపట్టారు. దువ్వ అక్విడేట్ వద్ద వరద నీరు పెరిగి 11 అడుగులకు చేరుకుంది. సాయంత్రానికి మరింత పెరుగుతుంది. వరద ముంపునకు గురైన 60 పూరి గుడెసెలు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వయ్యేరు కాలువ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పర్యవేక్షించారు.

రోడ్డు పక్కన టిఫిన్ చేసిన మంత్రి

నరసాపురం: సాధారణ వ్యక్తిగా రహదారి పక్కన హోటల్లో రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు టిఫిన్ చేశారు. శుక్రవారం పాలకొల్లు నుంచి అమరావతి వెళుతుండగా మార్గమధ్యలో నరసాపురంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సెంటర్లో రోడ్డు పక్కన ఉన్న సాధారణ హోటల్లో ఆయన టిఫిన్ చేయడం అందరిని ఆశ్చర్యపరిచింది. సామాన్య వ్యక్తిగా గొడుగు పట్టుకుని హోటల్కి వెళ్లి స్వయంగా టిఫిన్ తీసుకుని ప్రజలతో కలిసి తింటూ మాటామంతి కలిపి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. హోటల్ యాజమాని కాగిత వేంకటేశ్వరరావు, సిబ్బందితో పాటు రోడ్డుపై సామాన్య ప్రజలను, చిరు వ్యాపారులను చిరునవ్వుతో ఆయన పలకరించారు.

లెప్రసీ వ్యాధిపై గ్రామంలో సర్వే

గణపవరం: ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు లెప్రసీ వ్యాధిపై గ్రామాల్లో సర్వే చేయుటకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 28 మంది ఆశాలు, 28 మంది వాలంటీర్లు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సంతోష్ చెప్పారు. ఒక్కొక్క టీం 15 నుంచి 20 ఇళ్ల వద్దకు వెళ్లి ఇంట్లో ఉన్నవారికి స్పర్శ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలు ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే అనుమానిత పరిస్థితి గుర్తించి వారిని ఆసుపత్రికి పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్మయి, హెల్త్ సూపర్వైజర్ సిహెచ్.పద్మజ, ఆరోగ్య కార్యకర్తలు ఎమ్ఎల్హెచ్పిఎస్ పాల్గొన్నారు. సర్వేలో భాగంగా గణపవరం మూడో సచివాలయం వేలంపేటలో ఉన్న స్థానికులకు ఆశా కార్యకర్తలు వైద్య పరీక్షలు నిర్వహించారు.

21న రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం రోటరీ క్లబ్ ఆఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 21వ తేదీన వైన్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబతుల సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం పిజి సెమినార్ హాల్లో రోటరీ నూతన కార్యవర్గం(2024 - 2025) ప్రెసిడెంట్గా గన్నాబత్తుల సత్యవతి, సెక్రటరీగా బొమ్మిడి సూర్యకుమారి, ట్రెజరర్గా ఆత్మూరి రమ ప్రమాణస్వీకారం చేయుచున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్రావు, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, నరసాపురం ఆర్డిఒ అచ్యుత్ అంబరీష్, చైర్పర్సన్ బర్రె వెంకటరమణ జయరాజు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, బిజెపి నరసాపురం కన్వీనర్ మేకల సతీష్, టిడిపి నరసాపురం ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి యతిరాజు రామ్మోహన్ నాయుడు, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ విచ్చేస్తున్నారని తెలిపారు.

డ్రోన్ వినియోగంతో ఆర్థికాభివృద్ధి

డిఆర్డిఎ పీడీ వేణుగోపాల్

ఆకివీడు: వ్యవసాయ రంగంలో డ్రోన్ స్ప్రేయర్లతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని డిఆర్డిఎ పీడీ వేణుగోపాల్ సూచించారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ప్రెన్యూర్షిప్(ఎంఎస్ ఎంఇ) ఆధ్వర్యంలో బైరాజ్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని మహిళలకు డ్రోన్ స్ప్రే వినియోగంపై మహిళలకు జిల్లాలో పలుచోట్ల అవగాహన, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక స్వయం సహాయక సంఘాల మండల కార్యాలయంలో మహిళలకు డ్రోన్ స్ప్రే వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ మాట్లాడారు. వరి రైతులు చేలలో ఎరువులు పిచికారీ చేయడానికి ఈ స్ప్రే డ్రోన్లు బాగా వినియోపడతాయని సూచించారు.

స్టాంపుల కొరతను నివారించాలని న్యాయవాదుల ధర్నా

తణుకు : కోర్టు ఫీజు స్టాంప్స్ కొరతను నివారించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోర్టు ఫీజు స్టాంప్స్ కొరతను నివారించాలని శుక్రవారం స్థానిక తణుకు సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు న్యాయవాదులు, కక్షిదారులు ధర్నా నిర్వహించి, సబ్ రిజిస్టర్కి మెమొరాండాన్ని అందజేశారు.

అనారోగ్య బాధితురాలికి సాయం

తణుకు : తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ నందు కిడ్నీ, లివర్ వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న మాదాసు తులసి దుర్గసాయికి రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. రాజమండ్రి ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో ఐసియులో వైద్యం పొందుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆమె ఆరోగ్యం బాగుండాలని సాయం చేసినట్లు తెలిపారు. తణుకు మానవతా ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15వేలు అందజేశారు.

సార్వాకు వానగండం..

నీట మునిగిన వరినాట్లు

ప్రజాశక్తి - ఆచంట


ఆచంట: నీటమునిగిన వరినాట్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా ఏకదాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు సార్వ పంటకు వాన గండం ఏర్పడింది. మండలంలో సుమారు 60 ఎకరాల్లో నారుమడులు, మరో సుమారు 350 ఎకరాల్లో నాట్లు నీట మునిగినట్లు మండల ఎఇఒ బి.నాగరాజు తెలిపారు. ఆచంట వేమవరంలో గత పది రోజుల క్రితం వేసిన నారుమళ్లలో విత్తనాలు ఒకచోటకు చేరిపోయి మొలకెత్తే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని నారుమడులు పూర్తిగా నీట మునిగాయి. ఈ దశలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతన్నలను దెబ్బతీస్తున్నాయి. నీటమునిగిన నారుమడుల్లో నాట్లను కాపాడుకునేందుకు రైతన్నలు వర్షంలోనే శ్రమిస్తున్నారు. వర్షాలు కారణంగా నారుమడుల్లో నీరు నిలిచిపోయి విత్తనాలు కుళ్లిపోతాయని, దీంతో సార్వాపంటకు నారు కొరత ఏర్పడే పరిస్థితి ఉందని పలు రైతులు వాపోతున్నారు.

ఉండి: గత రెండు రోజులుగా ఉండి మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఆకుమడులు, ఊడ్చిన వరి మొనలు ముంపుకు గురై రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణంరాజు అన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లన్ని తూడు, గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయని, వాటిని ప్రక్షాళన చేయడానికి గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో భారీ వర్షాలకు, పంటలు ముంపుకు గురవుతున్నాయని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వమైనా మురుగు కాల్వల ప్రక్షాళనకు నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఉండి డెవలప్మెంట్ ఫండ్ ద్వారా నిధులు సమీకరించి మురుగు కాలువల ప్రక్షాళనకు పూనుకోవడం అభినందనీయమని, ప్రభుత్వ సహకారం కోసం ఎదురు చూడకుండా రైతులే తమ పంటను కాపాడుకోవడానికి ముందుకు రావడం శుభ సూచికమన్నారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఉండి బస్టాండ్ జలమయమవడంతో గ్రామపంచాయతీ అధికారులు బస్టాండ్లోని నీటిని తొలగించే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.

నరసాపురం: మండలంలోని లింగనబోయినచర్ల గ్రామ పంచాయతీలో గల ప్రధాన రహదారి రోడ్లో వర్షంనీరు బయటకు వెళ్లక గ్రామస్తులు, ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది, కార్యదర్శికి పలుమార్లు చెప్పినా ఫలితం శూన్యమని గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు బొడ్డు ఆశిష్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, ఎక్కడి చెత్త అక్కడే ఉండి దుర్వాసన వస్తుందన్నారు. పంచాయతీలో దోమలు ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు అనారోగ్యంకు గురవుతున్నారన్నారు. రోడ్లపై తక్షణమే నీరు బయటకు వచ్చే శాశ్వత పరిష్కారం చేపట్టాలని తెలిపారు.

పలుచోట్ల మిషన్ శక్తిపై అవగాహన

ఉండి: బాల్యవివాహాలను అడ్డుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం అన్నారు. ప్రధానమంత్రి మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉండి మండలం యండగండి, వెలివర్రు గ్రామాల్లోని పాఠశాలల్లో కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాణి విజయరత్నం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, వీటిని అడ్డుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. ఏమీ తెలియని వయసులో వివాహాలు చేయడం వల్ల వారి దాంపత్య జీవితం ఇబ్బందులను ఎదుర్కొంటుందని తెలిపారు. యుక్త వయస్సులో గర్భందాల్చడం వల్ల రక్తహీనత, గర్భకోస వ్యాధులు తలెత్తుతాయని ఆమె వివరించారు. బాలికలు చదువుకునేందుకు ప్రోత్సహించాలని, వారు బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకున్నందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సాంకేతికంగా అన్ని రంగాల్లోనూ ముందుకు వెళుతున్న నేటి సమాజంలో మహిళలపై వేధింపులు మాత్రం తగ్గడం లేదని, మహిళలను వేధిస్తున్న వారిపై, వరకట్న వేధింపులపైన కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.నిర్మల, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీలు, ఆరోగ్య సిబ్బంది, కిశోర బాలికలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: మిషన్ శక్తి వంద రోజుల అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లోనూ మిషన్ శక్తిపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్థానిక 36వ వార్డ్ పరిధిలో గల రామరాజు, తుందుర్రు, రాయలం గ్రామాలతో పాటు పలు అంగన్వాడీ కేంద్రాల్లో మిషన్ శక్తిపై చిన్నారుల తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత, బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్స్ సరళ, సరోజిని అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్ మహాలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

వీరవాసరం: మహిళ, శిశు సంక్షేమమే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని ఐసిడిఎస్ సిడిపిఒ టికెవి.లక్ష్మీకాంతం అన్నారు. మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెక్కిపాలెం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే బాలలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా మిషన్శక్తి వన్స్టాప్ సెంటర్ కౌన్సిలర్ ఎం.సూర్యప్రభ మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్లే కలిగి అనర్థాలను తెలుసుకుని వాటిని పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కనకమహాలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు జి.వరలక్ష్మి, వై.పెద్దింట్లమ్మ, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మునిగిన నారుమళ్ల పరిశీలన


గణపవరం:వరినాట్లు పరిశీలిస్తున్న అధికారులు

గణపవరం: వాయుగుండం ప్రభావం వల్ల కురిసిన వర్షాలకు మండలంలో మునిగిపోయిన వరి నారుమళ్లను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వై.ప్రసాద్ పరిశీలించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 117.13 ఎకరాలు సాగు విస్తరణ ఉండగా 32.61 ఎకరాల్లో వరినాట్లు వేయడం జరిగిందన్నారు. వర్షాల కారణంగా 984.5 నీటిలో మునిగినట్లు చెప్పారు. ప్రస్తుతం రైతులు 584.729 ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. మిగిలిన నారుమడిలో 136.645 ఎకరాలు నారుమడి నీటిలో మునిగినట్లు ప్రాథమిక అంచెనా వేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ ప్రసాద్ రైతులతో మాట్లాడుతూ పంట పొలంలో ఉన్న నీరును బయటకు తీసే చర్యలు తీసుకోవాలని చెప్పారు. నారుమడి దశలో ఉన్న వరి పంట విత్తనం చల్లి రెండు, మూడు రోజుల వయసులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం తగ్గుతుందన్నారు. అందువల్ల రైతులు వీలైనంత తొందరలో నీళ్ల బయటకు తీసివేయాలని తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో నీట మునిగిన వరి చేలను మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ రహీం శుక్రవారం పరిశీలించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు నారుమళ్లు నీటమునిగాయి. వాటిని సందర్శించిన ఎఒ నారుమళ్ల రక్షణకు తీసుకోవాల్సిన రక్షణ చర్యలను వివరించారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని సగం చెరువు, ఆగర్రు, ఆగర్తిపాలెం, వెలివెల, లంకలకోడేరు, దగ్గులూరు, శివదేవుని చిక్కాల, బల్లిపాడు గ్రామాల్లో అధిక వర్షానికి ముంపుకు గురైన వరి నారుమడులను, వరి పొలాలను పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు అడ్డాల పార్వతి, మండల వ్యవసాయ అధికారి కె.రాజ శేఖర్ పరిశీలించారు. నారుమడులు, వరి పొలాల ముంపునకు గురైన రైతులందరూ మడి లేదా పొలంలో ఉన్న నీటిని బయటకు పోయే విధంగా చేసుకోవాలని తెలిపారు.

వరి పొలాల్లో యాజమాన్య పద్ధతులపై సూచన

వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజా రాణి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుతం అల్పపీడనం వల్ల కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరిపంట ముంపుకు గురి అవుతుందని, అలాంటి వేళలో యాజమాన్యం చేసి, రక్షించుకోవాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజా రాణి తెలిపారు. శుక్రవారం ఆమె ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రంలో జూన్లో విత్తిన పొలాలు, పిలకలు దశలో, జులైలో విత్తిన పొలాలు నారుమడి దశలో, నేరుగా విత్తిన పొలాలు మొలక దశ నుంచి మొక్కదశలో ఉన్నాయి. నెల్లూరు ప్రాంతంలో ఎడగారు వరిసాగు పిలకల దశలో ఉన్నాయని తెలిపారు. వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో 3 రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. వీలైనంత త్వరగా నీరు బయటకు తీసివేయాలి. ఈ దశలో ముంపును తట్టుకునే భీమ(ఎంటియు 1140) రకం విత్తిన 10 రోజుల వరకు ముంపుని తట్టుకుంటుంది. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఎంటియు 1232 రకం విత్తిన 15 నుంచి 70 రోజుల వరకు ముంపును తట్టుకుంటుంది. మునిగిన నారు మడిలో నుంచి నీరు 5 రోజుల లోపు పూర్తిగా బయటకు తీసివేసిన తర్వాత 5 సెంటల నారుమడికి 1 కిలో యూరియా, 1 కిలో పోటాష్ వేసుకోవాలి. 1గ్రా కార్బెన్డిజిమ్ లేదా 2 గ్రా కార్బెన్డిజిమ్ మాంకోజెబ్ పిచికారీ చేయాలని సూచించారు.

సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధం

ముఖ్యమంత్రికి వివరించిన కలెక్టర్ నాగరాణి

భీమవరం: జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుని సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. శుక్రవారం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా అధిక వర్షాలు కురుస్తున్న అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వాతావరణ శాఖ ద్వారా వర్షాలు, వరదలను అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.

ఎంఎల్ఎకు అంగన్వాడీల వినతి

ఆచంట: అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్ కామారు తులసి అన్నారు. శుక్రవారం కొమ్ము చిక్కాలలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు అంగన్వాడీ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలుతో పాటు, రాష్ట్రంలో అంగన్వాడీ సమస్యల సాధనకు చేసిన సమ్మె కాలంలో అనివార్యంగా గత ప్రభుత్వం కొన్ని జీవోలు ఇచ్చిన ప్రధాన సమస్యలు పరిష్కారం చేయలేదని అన్నారు. తక్షణమే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, మండల నాయకులు మైలే విజయలక్ష్మి, విజయలక్ష్మి, పిడి పరమేశ్వరి పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు'

ఆచంట: ప్రజాక్షేమం చూడమని అధికారమిస్తే కూటమి నాయకులు పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంచి చేయమని అధికారం ఇస్తే మానవత్వాన్ని మంటగలిపి మారణ హోమం సృష్టిస్తున్నారన్నారు. నడిరోడ్డుపై హత్యలు, పసి పిల్లలపై మానభంగాలు, మహిళలపై అత్యాచారాలు, ప్రతిపక్ష నాయకులపై దాడులతో రాష్ట్రాన్ని రక్తపాతంలో ముంచెత్తుతున్నారన్నారు. ఇటువంటి సంఘటనలు ఇలాగే కొనసాగితే మీకు ఒక్కసారి ప్రజలే మీపై తిరగబడి తరిమి కొడతారని హెచ్చరించారు.

చేనేతకు చేయూతనివ్వండి..

పెనుమంట్ర : ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరూ చేనేత వస్త్రాలు ధరించేలా ఆయా ప్రభుత్వాలు జీవో విడుదల చేయాలని జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కర్ రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాలను కోరారు. శుక్రవారం మార్టేరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేనేత కార్మికులను గౌరవిస్తూ వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు సబ్సిడీ మీద ఆయా విక్రయ కేంద్రాల్లో చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి, మిగిలిన ప్రజలకు ఆదర్శంగా నిలిస్తే, చేనేత విక్రయాలు పెరిగి, చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకున్నట్లు అవుతుందని అన్నారు.

హరివిల్లు ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు

పాలకొల్లు: స్వామి వివేకానంద, సర్వేపల్లి రాధాకృష్ణన్, మహాత్మాగాంధీ, బిఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం లాంటి వారి ఉపన్యాసాలు చరిత్ర పుటల్లో సజీవంగా నిలిచాయని, చారిత్రక రచనలు, నటుడు వాదిప్ప సుందరరావు అన్నారు. పాలకొల్లు హరివిల్లు సంస్థ పాలకొల్లు ఏరియా ఉన్నత పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు 'వక్తృత్వ పోటీలు' శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సరస్వతీ శిశు మందిరంలో ఏర్పాటు చేసిన 'మంచి ఉపన్యాసం ఎలా ఇవ్వాలి' అనే అంశంపై మాట్లాడారు. వక్త ముఖంలో చిరునవ్వు, కలుపుగోలు తనం వుండాలి, చెప్పే విషయం పెద్ద, చిన్న అని కాకుండా భావం ఫ్రెష్, తడబాటు లేకుండా స్పష్టంగా చెప్పాలని మంచి ఉపన్యాసకులు పేరు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

సాధారణ కాన్పులు జరిగేలా చర్యలు

కాళ్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు జరిగే విధంగా చర్యలు తీసుకొని సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భానునాయక్ సూచించారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భానునాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించి జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి పలు సూచనలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ సరళ సురేఖ పాల్గొన్నారు.

జన సైనికునికి ప్రమాద బీమా చెక్కు అందజేత

ఉండి: ఇటీవల ప్రమాదంలో గాయపడిన జనసైనికుడు యర్రా ఆదినారాయణకు రూ.24 వేల విలువచేసే ప్రమాద బీమా చెక్కును నియోజకవర్గ ఇన్ఛార్జి జుత్తిగ నాగరాజు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ రూ.500తో జనసేన సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా అందించడం జరుగుతుందన్నారు. ఉండి మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన యర్రా ఆదినారాయణ ఇటీవల ప్రమాదంలో గాయపడడంతో పార్టీ అధిష్టానం ప్రమాద బీమా చెక్కును పంపించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జనసైనికులు మేడిది వాసు, యర్రా వెంకటేశ్వరరావు, ఓదూరి దుర్గారావు, మంచన వెంకన్న పాల్గొన్నారు.

జలమయమైన రహదారులు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. శుక్రవారం మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటి పాలెం, గొల్లగూడెం, పాలకమేదపు తదితర గ్రామాల్లో కచ్చా డ్రెయినులను ఏర్పాటు చేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో భూగర్భంలోని పూడికను సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, కార్యదర్శి జి.గంగన్న పర్యవేక్షణలో తొలగించారు. పేరుపాలెం నార్త్లో సర్పంచి పేరుపాలెం వెంకన్న పర్యవేక్షణలో యంత్రాలతో కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేశారు.

రజక కార్పొరేషన్కు నిధులు కేటాయించాలని వినతి

పాలకొల్లు: రాష్ట్రంలో రజక కార్పొరేషన్కు ఎక్కువ నిధులు కేటాయించి, న్యాయం చేయాలని మాజీ ఎంఎల్సీ అంగర రామ్మోహన్ను రాష్ట్ర రజక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు పాలకొల్లులోని మాజీ ఎంఎల్సీని స్వగృహం వద్ద శుక్రవారం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నడిపూడి సూర్యనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు, పోచారం సత్యనారాయణ, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి గుగ్గిలపు రామకృష్ణులు మాజీ ఎంఎల్సీని కలిసి న్యాయం చేయాలని కోరారు.

గాంధర్వ మహల్ అద్భుతం : ఎంఎల్ఎ

ఆచంట: మహారాజుల కాలంలోని నిర్మించిన అద్భుత కట్టడాలు మనం చూసేమా కానీ వందేళ్ల క్రితం నిర్మించిన గాంధర్వ మహల్ నిజంగా అద్భుత భవనమని ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గాంధర్వ మహల్ 100 వసంతాల వేడుకలు శుక్రవారం సాయంత్రం ఆచంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు సిమెంట్ వినియోగంలోని నాటి కాలంలో గానుగా సున్నంతో కూడిన మిశ్రమాన్ని వినియోగించి ఎంతో క్రమంలో 1924లో అద్భుత కట్టడాన్ని నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. భవనం రెండవ అంతస్తులు సెంట్రిక్ హాల్ డిజైన్ మహాద్భుతంగా ఉందన్నారు. ఈ భవనం నిర్మించి 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గొడవర్తి విద్యాసాగర్, గొడవర్తి నాగేశ్వరరావు, గొడవర్తి శ్రీరాములు, గొడవర్తి వెంకన్న బాబు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఉండి: మండలంలోని అర్తమూరు శివారు కవితం పాకల సమీపంలోని తల్లికోడు మురుగు కాల్వ వద్ద శుక్రవారం మధ్యాహ్నం సుమారు 20 సంవత్సరాలు నుంచి 30 సంవత్సరాల వయస్సు గల మృతదేహం లభించిందని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో మృతదేహాన్ని నలుపు రంగు చారలు ఉన్న టీ షర్ట్ ఉందని, స్థానికుల ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెనుగొండ

యువతి అదృశ్యమైందని తండ్రి పుచ్చకాయల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెనుగొండ గ్రామానికి చెందిన పుచ్చకాయల సౌమ్య(19) గురువారం ఒక ప్రయివేట్ హాస్పిటల్కి తల్లిదండ్రులు, కుమార్తె కలిసి బయటకి వెళ్ళి ఇంటికి వచ్చారన్నారు. ఆ సాయంత్రం కనిపించకపోవడంతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

గణపవరం: మండలంలో ఈనెల 23 నుంచి 27 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీ సరస్వతి శుక్రవారం తెలిపారు. క్యాంపులను గ్రామాల్లో సచివాలయాలు, పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. స్థానిక ప్రజలు ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని సూచించారు.

పశువులకు చికిత్స

పాలకొల్లు రూరల్: పాలకొల్లు మండలం ఆగరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్లో భాగంగా పశువులకు ఉచిత గర్భకోష వ్యాధి నివారణా చికిత్స శిబిరం పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ తరుపున సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి పి.వరప్రసాద్ రైతులకు తగు సూచనలు చేసి మాట్లాడారు. 64 పశువులకు గర్భకోష పరీక్షలు నిర్వహించి, 28 పశువులకు, 24 మేకలకు వైద్యం అందించారు. 48 గేదెలు, ఆవులు, దూడలకు దొమ్మ వ్యాధి శోకకుండా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి శాఖ గంగారత్నం, డాక్టర్ జవహర్ హుస్సేన్, డాక్టర్ యేసు రత్నం పాల్గొన్నారు.

కంట్రోల్రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎంఆర్ఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. విఆర్ఒల సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. అందరూ హెడ్ క్వార్టర్లలో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

In The Court Of Hon`ble Principal Junior Civil Judge Cum Junior Civil Judge Cum Junior Division Court Bhimavaram

O.S.No. 476/2021 in I.A.No. 521/2024

బిట్వీన్:
సిర్రా గ్రేస్ సలోమి -వాది
మరియు
ఘంటానంధియ్య (And Another) -ప్రతివాదులు

1వ ప్రతివాదులు:
ఘంటా నందియ్య తండ్రి సూరయ్య, 3వ కాలని, కలవపూడి గ్రామము, కాళ్ళ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

వాది:
సిర్రా గ్రేస్ సలోమి గౌరవ కోర్టులో దావావేయగా, సదరుకోర్టు వారు ఎన్ని పర్యాయములు సమన్లు పంపిన తీసుకోనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన జారి చెయ్యడమైనది. IA.No. 521/2024 ద్వారా ప్రతివాదికి **12-08-2024 వతేది. ఉదయం 10-30 గంటలకు** స్వయముగా గాని, లేదా వారి తరపున అడ్వకేటు ద్వారా గాని, శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపనులు తెలియపర్చుకొపవలెను. లేనిచో శ్రీ కోర్టువారు పరోక్షమున దావాగ్రంధము జరుపబడునని తెలియజేయడమైనది.

భీమవరం **కాపా కళ్యాణ్ మరియు నన్నేటి మోహన్లాల్**
తేది:19-07-2024 అడ్వకేట్స్, భీమవరం
సెల్: 9293947199

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

ఈ.పి. నెం. 3/2023
ఇన్ ఓ.ఎస్. నెం. 225/2009

బిట్వీన్:
అడబాల శ్రీనివాస సత్యనారాయణ -పెటీషనర్\DHR
మరియు
గొర్రెల అప్పారావు -రెస్పాండెంట్\JDR

రెస్పాండెంట్\JDR అడ్రసు : గొర్రెల అప్పారావు, S/o గురుమూర్తి, వయస్సు 60 సం॥లు, పురుషుడు, రిటైర్ట్ డెల్టా పేపర్ మిల్లు ఉద్యోగి, R/o D.No. 1-15, వేంద్ర గ్రామం, పాలకోడేరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు ఇ.పి లో శ్రీ కోర్టువారు రెస్పాండెంట్\JDR కు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిన తీసుకొనక కాలయాపన చెయుచ్చునందున, శ్రీ కోర్టువారి అనుమతితో ఈ ప్రకటన జారీ చెయ్యడమైనది. పై నెంబరు ఇ.పి లో రెస్పాండెంట్\JDR. **ది. 19-08-2024వ తేది ఉదయం 10-30 గంటలకు** స్వయముగా గాని లేదా వారి తరపున అడ్వొకేటు ద్వారాగాని శ్రీ కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపనులు తెలియ పర్చుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టువారు రెస్పాండెంట్\JDR పరోక్షమున E.P గ్రంధను నిర్ధారించబడునని తెలియజేయడమైనది.

మోపాటి బాల పరమేశ్వరరావు BA BL,
భీమవరం అడ్వకేట్,
తేది:19-07-2024 చిన్నివారి వీధి, భీమవరం
సెల్: 9397111787